AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in


## తెయూలో కొనసాగుతున్న పరీక్షలు



**అక్షరటుడే, ఇందల్వాయి:** తెలంగాణ విశ్వ విద్యాలయ పరిధిలో పీజీ ఇంటిగ్రేటెడ్ కోర్సులు పరీక్షలు కొనసాగు ఉన్నాయి. ఐదో రోజు సోమవారం ప్రశాంతంగా జరిగాయని ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య ఘంటా చంద్రశేఖర్ పేర్కొన్నారు. పీజీ ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు ఏపీఈ, ఐపీసీహెచ్ ఏడో, తొమ్మిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు జరిగాయన్నారు. ఉదయం జరిగిన ఈ పరీక్షలకు 59 మంది విద్యార్థులకు గాను వందశాతం హాజరయ్యారని ఆయన పేర్కొన్నారు.


17-11-2025 NIZAMABAD / KAMAREDDY PAGES - 2




## పోలీస్ ప్రజావాణికి 20 వినతులు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను చట్టపరంగా పరిష్కరించాలని పోలీస్ అధికారులకు సీపీ సాయిచైతన్య ఆదేశించారు. నిజామాబాద్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం పోలీస్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ ఫిర్యాదుదారుల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం వారి సమస్యలు తెలుసుకుని చట్టప్రకారంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు. పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పనిచేస్తోందని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కాగా.. మొత్తం 20 ఫిర్యాదులు వచ్చాయి.

## రేపు యూనిటీ మార్చ్

**అక్షరటుడే, ఇందూరు:** సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో ఈనెల 18న యూనిటీ మార్చ్ నిర్వహించనున్నట్లు మై భారత్ కో-ఆర్డినేటర్ శైలి బెల్లాల్ తెలిపారు. ఉదయం 9 గంటలకు నగరంలోని వర్ని చౌరస్తాలో గల సర్దార్ పటేల్ చౌక్ నుంచి ఆర్ఆర్ చౌరస్తా, పులాంగ్ చౌరస్తా, కోర్టు సర్కిల్ మీదుగా పాత కలెక్టరేట్ మైదానం వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీ ధర్మపురి అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.



## జాతీయ స్థాయి పోటీలకు జిల్లా తైక్వాండో క్రీడాకారులు

**అక్షరటుడే, ఇందూరు :** జాతీయ తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభతో పతకాలు సాధించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భరత లక్ష్మి ఆకాంక్షించారు. ఎంపికైన జిల్లా క్రీడాకారులు సోమవారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారులు సిద్ధార్థ, భవ్య, సాయి ప్రసన్న, అనన్య, అభిరాం, సాయి దీక్షితులు ఎంపికైనట్లు అసోసియేషన్ కార్యదర్శి మనోజ్ కుమార్ తెలిపారు. జాతీయస్థాయి పోటీలు పంజాబ్‌లోని జలంధర్‌లో ఈనెల 20 నుంచి 23వ తేదీ వరకు జరుగనున్నట్లు చెప్పారు.

విద్యాశాఖలో ఉమ్మడి పరీక్షల విభాగం ఎంతో కీలకమైంది. ఒక్కమాటలో చెప్పాలంటే విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించేది. ప్రశ్నాపత్రాల రూపకల్పనలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఇలాంటి విభాగంలో కార్యదర్శి మరింత కీలకంగా వ్యవహరిస్తారు. అయితే ప్రస్తుత కార్యదర్శి పదవీకాలం గత నెలలో ముగిసింది. నూతన డీసీఈబీ కార్యదర్శి నియామకానికి కసరత్తు కొనసాగుతోంది. దీంతో కొత్తగా కార్యదర్శి ఎవరు అవుతారని విద్యాశాఖలో చర్చ జరుగుతోంది.

- అక్షరటుడే, ఇందూరు




# డీసీఈబీ కార్యదర్శి ఎవరో!

- ఇప్పటికే రెండు పర్యాయాలు పూర్తి చేసుకున్న ప్రస్తుత కార్యదర్శి
- గత నెల ముగిసిన పదవీకాలం
- కొత్తవారి కోసం అధికారుల కసరత్తు

ఉమ్మడి పరీక్షల విభాగం (డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు) లో మొత్తం 10 నుంచి 12 మంది సభ్యులుగా ఉంటారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. నిబంధనల ప్రకారం సీనియర్ పీజీహెచ్ఎంను కార్యదర్శిగా ఎన్నుకుంటారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఓ సారి కార్యదర్శిని నియమిస్తారు. ప్రధానంగా ఆయా సబ్జెక్టుల్లో సీనియర్ ఉపాధ్యాయులను మెంబర్లుగా ఎంచుకుంటారు. ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు నిర్వహించే పరీక్షలకు సంబంధించి ప్రశ్నాపత్రాలను వీరు రూపొందిస్తారు.

### నిబంధనలు ఉల్లంఘించి..

ప్రస్తుతం డీసీఈబీ కార్యదర్శిగా ఉన్న సీతయ్య పదవీకాలం గత నెలలో ముగిసింది. ఇప్పటికే ఆయన రెండు పర్యాయాలు కొనసాగారు. నిజానికి ప్రభుత్వ ఉపాధ్యాయులను కార్యదర్శిగా నియమించాలి. కానీ గత డీఈవో నిబంధనలను ఉల్లంఘించి లోకల్ బాడీకి చెందిన సీతయ్యను నియమించారు. ఈయన హయాంలో అనేక అవకతవకలు జరిగినట్లు విమర్శలు వచ్చాయి. ప్రధానంగా రెండుసార్లు పేపర్లు లీక్ అయ్యాయనే ఆరోపణలు ఉన్నాయి. విచారణ అనంతరం క్లర్క్‌ను సస్పెండ్ చేశారు. డీసీఈబీ నిబంధనల ప్రకారం కార్యాలయానికి 8 కిలోమీటర్ల లోపు ఉన్న సీనియర్ ప్రభుత్వ పీజీ హెడ్మాస్టర్లు ఈ పదవికి అర్హులు. ప్రధానంగా ఉమ్మడి పరీక్ష విభాగంలో సభ్యుడై ఉండాలి. కానీ గతంలో ఇవేమీ పట్టించుకోకుండానే నియామకం చేపట్టారు. ఈ సారైనా నిబంధనల మేరకు నియామకం చేపడుతారా.. లేదా అని ఉపాధ్యాయులు చర్చించుకుంటున్నారు.

### లెక్కలు పక్కానా..

ప్రశ్న పత్రాల తయారీకి సంబంధించి విద్యాశాఖ నిబంధనల ప్రకారం ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఒక్కో విద్యార్థి నుంచి రూ.15 నుంచి రూ.16 వరకు సేకరిస్తారు. జిల్లాలో సుమారు లక్ష వరకు విద్యార్థులు ఉంటారు. అలాగే ప్రశ్నాపత్రాల ప్రింటింగ్ కోసం టెండర్లను ఆహ్వానిస్తారు. గతంలో ప్రైవేటు పాఠశాల విద్యార్థుల సంఖ్యను ఎక్కువగా చూయించి ప్రశ్నాపత్రాలను ప్రింటింగ్ చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు యూడైస్, అపార్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు.



## గెజిటెడ్ హెచ్ఎంను నియమించాలి

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లా పరీక్షల విభాగం కార్యదర్శిగా గెజిటెడ్ హెచ్ఎంను నియమించాలని గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయి రెడ్డి, పీఆర్‌టీయూ తెలంగాణ గౌరవ అధ్యక్షుడు కృపాల్‌సింగ్ కోరారు. జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత కార్యదర్శి పదవీకాలం ముగిసిందని ఆయన హయాంలో అనేక అవకతవకలు జరిగాయన్నారు. వాటిని దృష్టిలో పెట్టుకొని తిరిగి ఆయనకు పదవీ బాధ్యతలు ఇవ్వకూడదని డిమాండ్ చేశారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిని ఉమ్మడి పరీక్షల విభాగం కార్యదర్శిగా నియమించాలన్నారు.

## ప్రజావాణికి 101 ఫిర్యాదులు



**అక్షరటుడే, ఇందూరు :** ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 101 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, జిల్లా పరిషత్ సీఈఓ సాయాగౌడ్, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ సందీప్, డీపీవో శ్రీనివాస్, హౌసింగ్ పీడీ పవన్ కుమార్‌లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా.. ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అనంతరం మహిళా, శిశు, వయో వృద్ధుల, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రూపొందించిన వాల్ పోస్టర్లను కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి రసూల్ బీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## నగరంలో కార్డన్ సెర్చ్..


**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** నగరంలో సీపీ సాయిచైతన్య ఆదేశాల మేరకు పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ మేరకు నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో సుమారు వందమంది పోలీసులతో సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. ఏసీపీ నేతృత్వంలో ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి, టౌన్, రూరల్ సీఐలు, ఎస్సైలు, కానిస్టేబుళ్లు సుమారు వంద మంది బృందాలుగా తనిఖీలు చేశారు. వన్ టౌన్ పరిధిలోని రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్, ఆస్పత్రులు, చౌరస్తా, షాపింగ్ మాళ్లు, రోడ్డు పక్కన పడుకుని ఉన్నటువంటి అనాథలు, భిక్షాటన చేసే వాళ్లు, లేబర్లు, అపరిచితుల వివరాలు సేకరించారు. అనంతరం వారి ఫొటోలు తీసుకున్నారు.



## కవి సురేశ్‌కు 'పెందోట సాహిత్య పురస్కారం'


**అక్షరటుడే, ఆర్మూర్ :** జిల్లాకు చెందిన ప్రముఖ కవి తొగర్ల సురేష్ 'పెందోట సాహిత్య పురస్కారం' అందుకున్నారు. సిద్దిపేటలో శ్రీవాణి సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పుస్తకాల పోటీలో సురేశ్ రాసిన 'వెన్నెల్లో మా పల్లె' పుస్తకానికి పురస్కారం లభించింది. సిద్దిపేట లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వాహకులు పెందోట వెంకటేశ్వర్లు, ప్రముఖ బాలసాహితీవేత్త గరిపెల్లి అశోక్,క్రియాశీల కార్యవర్గ సభ్యులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పురస్కారం, జ్ఞాపిక, సగదుతో సత్కరించారు. ఈ సందర్భంగా తొగర్ల సురేశ్‌ను ప్రముఖ కవులు తిరుమల శ్రీనివాస్ ఆర్య, కంకణాల రాజేశ్వర్, మద్దుకూరి సాయిబాబు, స్వర్ణ సమత, దారం గంగాధర్, డాక్టర్ బోచ్కర్ ఓం ప్రకాశ్, లయన్స్ క్లబ్ ఆఫ్ బాల్కొండ ఛైర్మన్, ప్రముఖ సామాజిక సేవకుడు, విశ్రాంత హెచ్ఎం చాకులింగం, సీనియర్ జర్నలిస్టు, బాల్కొండ చరిత్ర గ్రంథ రచయిత బ్రహ్మరౌతు నర్సింగ్ రావు తదితరులు అభినందించారు.

## యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి: సీపీ




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** యువత డ్రగ్స్, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య సూచించారు. ఎడపల్లి ఠాణా పరిధిలో జిల్లా పోలీస్ శిక్షణ మైదానంలో 26 టీంలను ఏర్పాటు చేసి కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా క్రికెట్ టోర్నీని బోధన్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించారు. సోమవారం టోర్నీ ముగింపు కార్యక్రమం నిర్వహించగా.. సీపీ సాయిచైతన్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత డ్రగ్స్, చెడు వ్యసనాలకు దూరంగా ఉండేందుకు ఈ టోర్నీ నిర్వహించినట్లు తెలిపారు. యువత కోసం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. యువత ఉత్సాహంగా టోర్నీలో పాల్గొన్నారని సీపీ పేర్కొన్నారు. ఇది కేవలం ఒక ఆట మాత్రమే కాదని.. మిమ్మల్ని నైతికంగా, శారీరకంగా, మానసికంగా బలంగా తీర్చిదిద్దే ఒక మంచి సాధనంగా కూడా భావించాలన్నారు. ఈ రోజుల్లో యువత మత్తుపదార్థాల వైపు ఆకర్షితులవున్నారన్నారు. ఒక్కసారి ఈ వ్యసనాల్లోకి అడుగుపెడితే జీవితాన్ని పూర్తిగా నాశనం చేసుకునే ప్రమాదం ఉందని హెచ్చరించారు. యువత దేశ భవిష్యత్తు కోసం మంచి ఆశయాలు, పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం.. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు, బోధన్ ఎస్‌హెచ్‌వో వెంకట్ నారాయణ, రుద్రూర్ సీఐ కృష్ణ, ఎడపల్లి ఎస్సై రమ, బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందేర్ రెడ్డి, రెంజల్ ఎస్సై చంద్ర మోహన్, కోటగిరి ఎస్సై సునీల్ 26 జట్ల క్రీడాకారులు యువత పాల్గొన్నారు.

## హైకోర్టు తీర్పు అమలు చేయాలి



**అక్షరటుడే, ఇందూరు:** తెలంగాణ యూనివర్సిటీలో జరిగిన అక్రమ నియామకాలను రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుని అమలు చేయాలని ఆల్ ఇండియా ఫార్వార్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2012లో అక్రమ నియామకాల రద్దుపై హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయకపోవడం సరికాదన్నారు. హైకోర్టు తీర్పు కాపీ అందలేదని చెబుతూ గత 15 రోజులుగా కాలయాపన చేయడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తీర్పులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని చెప్పారు.

## చిన్నారి బెజుగం శ్రీకృతికి బాలరత్న అవార్డు

**అక్షరటుడే, ఇందూరు:** నగరానికి చెందిన చిన్నారి కూచిపూడి నృత్య కళాకారిణి బెజుగం శ్రీకృతి 'బాలరత్న-2025' అవార్డు అందుకుంది. ఇటీవల హైదరాబాద్‌లో కళాకార్ తెలుగు టీవీ ఆధ్వర్యంలో బాలరత్న అవార్డుల అందజేత కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా చిన్న వయస్సులోనే కూచిపూడిలో ప్రతిభ చూపుతున్న బెజుగం శ్రీకృతి అవార్డు అందుకుంది. కార్యక్రమంలో సీనియర్ కెమెరామన్ సయ్యద్‌మీర్, హీరోయిన్ ట్వింకల్ కపూర్, బిగ్‌బాస్ ఫేమ్ కిరాక్ సీత, ప్రముఖ టీవీ సీరియల్ ఆర్టిస్టుల చేతులమీదుగా శ్రీకృతి బాల రత్న అవార్డు అందుకుంది. కాగా.. బెజుగం శ్రీకృతి ఇప్పటి వరకు ఎన్నో కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఇచ్చి ప్రతిభ కనబర్చి అవార్డులు అందుకుంది.



అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
2
నిజామాబాద్/కామారెడ్డి
సోమవారం
17.11.2025
www.aksharatoday.in
AKSHARA TODAY

## లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



**అక్షరటుడే, ముప్కాల్:** మండలంలోని కొత్తపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. గ్రామంలోని జైడి స్వరూపకు రూ.18,000, క్యాతం రాజా రెడ్డికి రూ.40,000, కలువ హరితకు రూ.12,000, మెర అమ్మైకి రూ.20,000 చెక్కులు అందజేశారు. చెక్కులను మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డికి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి సునీల్‌రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

### కమ్మర్‌పల్లిలో..



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండల కేంద్రంలో సోమవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుంకెటరవి లబ్ధిదారులకు అందజేశారు. నూకల లక్ష్మికి రూ.19,500, సుంకెట గణేశ్‌కు రూ.24,500, పత్రి లక్ష్మికి రూ. 36వేల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ చెక్కులు మంజూరు చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సునీల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మహిళా సాధికారతకు పునాది.. ఉజ్వల యోజన..

**అక్షరటుడే, బీర్కూర్:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఉజ్వల యోజన మహిళా సాధికారతకు పునాది రాయిలా నిలుస్తుందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. పథకం మూడో విడతలో భాగంగా మండల కేంద్రంలో లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు సాయికిరణ్ మాట్లాడుతూ.. దేశంలోని మహిళల ఆరోగ్యం రక్షించేందుకు, పొగ రహిత వంట గదులను అందించేందుకు ప్రధాని మోదీ ఉజ్వల యోజన రూపంలో చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారన్నారు. ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 10.33 కోట్ల మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందించడం కేంద్ర ప్రభుత్వ మహిళా సంక్షేమ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు రాధాకృష్ణ, మండల ఉపాధ్యక్షుడు రాము, వడ్ల బస్వరాజ్, నసురుల్లాబాద్ మండల అధ్యక్షుడు హన్మాండ్లు, పండరి తదితరులు పాల్గొన్నారు.

## ఆక్స్‌ఫర్డ్ స్కూల్ డైరెక్టర్‌గా వేద సాహితీ




**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్ యాజమాన్యం పాఠశాల అభివృద్ధి దిశగా కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ క్రమంలో సోమవారం ప్రముఖ విద్యావేత్త పంతులు నరేష్ తనయ వేద సాహితీ స్కూల్ నూతన డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. విద్యార్థుల్లో డిజిటల్ లిటరసీ, కమ్యూనికేషన్ స్కిల్స్, సమస్య పరిష్కరణ దక్షత, క్రిటికల్ థింకింగ్ వంటి నైపుణ్యాల పెంపు అత్యవసరమని.. ఈ దిశగా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆమె తెలిపారు. విద్యార్థులు పుస్తక జ్ఞానానికి మాత్రమే పరిమితం కాకుండా జీవన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేలా ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించనున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయులకు ఆధునిక బోధన విధానాలపై శిక్షణలు, తల్లిదండ్రులతో సమన్వయం, తరగతి వారీగా చదువు నాణ్యత పెంపు, సృజనాత్మక వాతావరణ నిర్మాణంపై దృష్టి సారించనున్నట్లు వెల్లడించారు. ప్రతి విద్యార్థిలోని ప్రతిభను గుర్తించి అభివృద్ధి చేయడం ఆక్స్‌ఫర్డ్ స్కూల్ ప్రధాన బాధ్యతగా భావిస్తున్నానని వేద సాహితీ పేర్కొన్నారు.

## వర్సిటీలో విద్యార్థుల ధర్నా



**అక్షరటుడే, ఇందల్వాయి:** వంటల్లో నాణ్యత లేని వస్తువులు వాడుతున్నారని తెలంగాణ యూనివర్సిటీలో విద్యార్థులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం క్యాంపస్‌లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. కొంతమంది విద్యార్థి సంఘాల నాయకులు చందాల కోసం కాంట్రాక్టర్లతో చేతులు కలిపి నాసిరకం వస్తువులను తీసుకొచ్చి వంటల్లో వాడుతున్నారని ఆరోపించారు. దీంతో తాము తినలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి, వార్డెన్, ప్రిన్సిపాల్ ధర్నా స్థలానికి వచ్చి విద్యార్థులతో మాట్లాడారు. వారి నుంచి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ధర్నా విరమించారు.

**ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన పేదలకు చేయూత ఇచ్చేందుకు ప్రభుత్వం సీఎం సహాయ నిధి ద్వారా సాయం అందజేస్తోంది. అనారోగ్య కారణాలతో ఆస్పత్రుల్లో చేరి అప్పులు పాలవుతున్న ఈ పథకం బాసటగా నిలుస్తోంది. సీఎంఆర్ఎఫ్ ద్వారా ఎంతో మంది లబ్ధి పొందారు. అయితే ప్రైవేట్ ఆస్పత్రుల్లో భారీగా డబ్బులు ఖర్చు చేసినా.. కొంతమొత్తమే సాయం అందుతోందని పలువురు పెదవి విరుస్తున్నారు. గతంలో కంటే సాయం తగ్గిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.** - అక్షరటుడే, కామారెడ్డి




# ఖర్చు బారెడు.. ఆసరా మూరెడు !

- సీఎం రిలీఫ్ ఫండ్ సాయంపై పెదవి విరుపు
- కనీసం 30 శాతం కూడా ఇవ్వడం లేదని ఆరోపణలు
- చెక్కును చించేసిన అధికార పార్టీ నేత

రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా పేద ప్రజలకు అండగా నిలిచేలా సీఎం రిలీఫ్ ఫండ్ పథకాన్ని కొనసాగిస్తూ వస్తున్నారు. దీని ద్వారా అనేక మంది లబ్ధి పొందుతున్నారు. ఇటీవల పలువురు సీఎంఆర్ఎఫ్ ద్వారా వచ్చే ఆర్థిక సహాయంపై పెదవి విరుస్తున్నట్టుగా ప్రచారం సాగుతోంది. ఆస్పత్రిలో అయిన ఖర్చుకు ప్రభుత్వం అందించే సహాయానికి పొంతన లేకుండా పోతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆస్పత్రిలో అయిన ఖర్చులో బాధిత కుటుంబానికి కాస్తయినా ఊరట కలిగించేలా ఆర్థిక సహాయం అందడం లేదని పలువురు చెబుతున్నారు.

### సాయం పెంచాలని విజ్ఞప్తి

ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. చికిత్సకు దాదాపు రూ.8 లక్షలకు పైగా ఖర్చయింది. పేద కుటుంబం కావడంతో అప్పు చేసి వైద్యం చేయించుకున్నాడు. బిల్లులతో సహా సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అతనికి రూ.75 వేలు మాత్రమే మంజూరు అయ్యాయి. దీంతో ఆ కుటుంబం తీవ్ర మనోవేదనకు గురైంది. ఈ క్రమంలో ప్రభుత్వం ఆర్థిక సహాయం పెంచాలని బాధితులు కోరుతున్నారు. ఆస్పత్రిలో ఖర్చయింది మొత్తానికి కనీసం 30 శాతం అయినా సహాయ అందించాలని వేడుకుంటున్నారు.

### చెక్కు చించేసిన సీడీసీ ఛైర్మన్

సదాశివనగర్ సీడీసీ ఛైర్మన్ ఇర్షాదోద్దీన్ ఇటీవల సీఎంఆర్ఎఫ్ చెక్కు చించివేయడం జిల్లాలో తీవ్ర చర్చకు దారి తీసింది. తన సోదరికి ఆస్పత్రిలో రూ.32 లక్షలు ఖర్చు అయితే సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి కేవలం రూ.60 వేలు మాత్రమే రావడాన్ని ఆయన నిరసిస్తూ చెక్కు అవసరం లేదని చించేశారు. అధికార పార్టీలో కొనసాగుతూ ఒక హోదాలో ఉన్న వ్యక్తి కుటుంబానికే ఈ పరిస్థితి ఉంటే సామాన్య ప్రజల పరిస్థితి ఇంకెలా ఉంటుందన్న చర్చ కొనసాగుతోంది.

ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాక బిల్లులతో సీఎంఆర్ఎఫ్ కింద దరఖాస్తు చేసుకుంటే తక్కువ సహాయం వస్తుందని పలువురు భావిస్తున్నారు. దీంతో తెలిసిన నాయకుల ద్వారా కొందరు చికిత్స కొనసాగుతుండగానే ప్రభుత్వం నుంచి ఎల్‌వోసీ తెప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు.

## ప్రజలను జాగృతం చేసేందుకు కళలు



**అక్షరటుడే, ఆర్మూర్:** కళలు ప్రజలను జాగృతం చేయడానికేనని ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి శివలింగం అన్నారు. పట్టణంలోని సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో సంస్థ ఆర్మూర్ ఏరియా మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాల నుంచే కళ అనేది పుట్టుకొచ్చిందని చెప్పారు. ప్రజానాట్యమండలి ఆర్మూర్ ఏరియా నూతన కమిటీ నాట్యమండలికి నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా తొగటి భూమేశ్వర్, అధ్యక్షుడిగా బోయ మల్లయ్య, ఉపాధ్యక్షుడిగా కూతాడి ఎల్లయ్య, గౌతమి, ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ సహాయ కార్యదర్శిలుగా రామోజీ అశోక్, గంగాధర్, కోశాధికారిగా లావణ్య, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కుల్దీప్ శర్మ, రవి తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమాల్లో వైద్య శిబిరాలు



**అక్షరటుడే, ఆర్మూర్:** అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిర సంస్థ ఆధ్వర్యంలో అంకాపూర్‌లోని పలు వృద్ధాశ్రమాల్లో వైద్యశిబిరాలు నిర్వహించారు. మండలంలోని పొద్దుటూరి సదానంద రెడ్డి వృద్ధాశ్రమం, లాలన వృద్ధాశ్రమంల్లో వృద్ధులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు వైద్య పరీక్షలు, రక్తపోటు, షుగర్, హిమోగ్లోబిన్ తదితర మౌలిక పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు నీలిమ, రక్షిత, ఎంఎల్‌హెచ్‌పీ అంజలి, ఎంఎల్‌హెచ్‌పీ వంశీ కృష్ణ, రాజ్యలక్ష్మి, చంద్రలేఖ ఆశా కార్యకర్తలు అనూష, జ్యోతి, మేరి తదితరులు పాల్గొన్నారు.

## డ్రంకన్ డ్రైవ్‌లో పలువురికి జైలుశిక్ష

**అక్షరటుడే, ఇందల్వాయి:** డ్రంకన్ డ్రైవ్‌లో పలువురికి జైలుశిక్ష, జరిమానాలు విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం డ్రంకన్ డ్రైవ్‌లో ముగ్గురు వ్యక్తులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కారు. దీంతో వారికి కౌన్సెలింగ్ నిర్వహించిన అనంతరం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు.

విచారించిన న్యాయమూర్తి నూర్జహాన్ ముగ్గురికి ఏడు రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. అలాగే ఇద్దరికి రూ.10వేల చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.



## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు

**అక్షరటుడే, బీర్కూర్:** బీర్కూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బరంగెడ్గి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రకృతి సంరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో ఈ పోటీలు నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సితాలే రమేష్ పేర్కొన్నారు. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని వివరించారు. విజేతలను ఎంపిక చేసి ప్రశంస పత్రాలు, బహుమతులు అందజేశారు. చెట్ల పెంపకం, నీటి సంరక్షణ, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం వంటి ప్రకృతి పరిరక్షణ మార్గాలను విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యుడు మేకల విఠల్, రషీద్, కార్తీక్ పటేల్, పాఠశాల హెచ్‌ఎం అశోక్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



## ఘనంగా పెద్దమ్మగుడి వార్షికోత్సవాలు

**అక్షరటుడే, ఆర్మూర్:** మండల కేంద్రంలోని పెద్దమ్మ గుడిలో ఏడో వార్షికోత్సవ వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు గుడికి తరలివచ్చి పెద్దమ్మతల్లిని దర్శించుకున్నారు. ముదిరాజ్ కులసభ్యులు సంప్రదాయంగా బోనాలను ఊరేగించారు. బోనాలను అలంకరించి పెద్దమ్మ తల్లికి సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కుల పెద్దలు, యువకులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## బస్సును ఢీకొని యువకుడి మృతి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** బస్సును వెనుక నుంచి ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. హాజీపూర్ వద్ద ఈ ఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సు కామారెడ్డి నుంచి పిట్లం వైపు వెళ్తోంది. మార్గమధ్యంలో హాజీపూర్‌లో ఓ ప్రయాణికుడిని దింపే క్రమంలో బస్సు డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. బస్సు వెనకే వస్తున్న మాదిగ కాశీరాం(32) బస్సును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. కాశీరాం లింగంపేట మండలం మంబాజీపేటకు చెందినవాడిగా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరత



**ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరత సమస్యగా మారింది. ఇసుక దొరకక పనులు ముందుకు సాగడం లేదు. మండల కేంద్రాలు, గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులు లబ్ధిదారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. కానీ నిర్మాణాలకు అవసరమైన ఇసుకను సరఫరా చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోతున్నాయి.** – అక్షరటుడే, బోధన్

- మధ్యలోనే నిలిచిపోతున్న నిర్మాణాలు
- అధికారులను సంప్రదించినా స్పందించని వైనం

పట్టణాల్లో నిర్మించే ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక దొరకడం లేదు. దీంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. బోధన్ పట్టణంలో సుమారు 300కు పైగా ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకుంటున్నారు. అయితే ఇంటి నిర్మాణంలో ప్రధానంగా కావాల్సిన ఇసుక లబ్ధిదారులకు లభించడం లేదు. దీంతో పనులు మందుకు సాగడం లేదు.

### స్లాబ్‌లెవల్‌లో నిలిచిపోయి..

చాలా వరకు ఇళ్లు స్లాబ్ వరకు పూర్తయ్యాయి. అయితే మిగతా పనికోసం ఇసుక కొరత ఏర్పడింది. కొనసాగుతున్న ఇళ్ల పని ఆధారంగా లబ్ధిదారులకు చెక్కులు మంజూరవుతున్నాయి. కానీ ప్రస్తుతం ఇసుక లేక పనులు ఆగిపోతుండడంతో చెక్కుల పంపిణీ సైతం నిలిచిపోతున్నాయని లబ్ధిదారులు వాపోతున్నారు.

### వార్డు ఆఫీసర్ల నిర్లక్ష్యం..

ఇందిరమ్మ ఇళ్లను పర్యవేక్షించాల్సిన వార్డు ఆఫీసర్లు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని లబ్ధిదారులు చెబున్నారు. ఒకవైపు జిల్లా యంత్రాంగం ఇందిరమ్మ ఇళ్లలో వేగం పెంచాలని చెబుతున్నప్పటికీ స్థానిక అధికారుల అలసత్వం మూలంగా పనులు సాగడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక సరఫరా చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు

### ఇసుక లేక పని ఆగింది

నేను ఇందిరమ్మ పథకం కింద ఇల్లు నిర్మించుకుంటున్నాం. ఇంటికి చెక్కకొట్టి 15 రోజులైంది. ఇసుక లేకపోవడంతో నిర్మాణం పనులు ముందుకు సాగడం లేదు. ఇసుక సరఫరా కరెక్టుగా చేస్తే నిర్మాణం త్వరగా పూర్తవుతుంది. అధికారులు స్పందించి ఇసుక సరఫరా అయ్యేలా చూడాలి.

– భాగ్యలక్ష్మి,
**లబ్ధిదారు, బోధన్**

### పర్మిషన్లు ప్రారంభం అయ్యాయి

వారం రోజుల క్రితం నుంచే ఇసుకకు పర్మిషన్లు ప్రారంభమయ్యాయి. ముందుగా మొదటి విడతలో రూరల్ ఏరియాలో పర్మిషన్లు ఇస్తున్నాం. రెండో విడతలో పట్టణంలో కూడా పంపిణీ చేస్తాం. పట్టణంలో మంగళవారం నుంచి ఇసుకకు పర్మిషన్లు ఇస్తున్నాం.

**- విఠల్, తహశీల్దార్, బోధన్**